సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 28 । జూన్ । 2025



ఎట్టకేలకు వేతనాలు 8లో▸

ఉద్యోగ నియామకం కోసం పరీక్ష రాసి ఎంపికైన 15 ఏళ్లకు నియామక ఉత్తర్వులు చేతికందాయి. విధుల్లో చేరిన నాలుగు నెలల తర్వాత వేతనాలు మంజూరయ్యాయి.



ఆర్జీయూకేటీలో ధ్రువపత్రాల పరిశీలన 8లో▸

ఆర్జీయూకేటీలో మహబూబ్‌నగర్ కేంద్రానికి చెందిన స్పోర్ట్స్, ఎన్‌సీసీ కోటా ఆధారిత విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

'మధ్యాహ్న' కార్మికుల సమ్మె నోటీసు



నినాదాలు చేస్తున్న 'మధ్యాహ్న' కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యల పరిష్కారంలో భాగంగా వచ్చే నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని మధ్యాహ్న భోజన కార్మికులు పేర్కొన్నారు. ఈ మేరకు డీఈవో శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా పది కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సమ్మెలో పాల్గొననున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పని భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, గ్రాట్యూటీ, పెన్షన్, ఈఎస్‌ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శశికళ, పుష్ప, శ్రీదేవి, రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లాలో 251 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 225 మంది ఉత్తీర్ణులయ్యారు. 89.64శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలురు 155 మందికి గాను 134 మంది, బాలికలు 96 మందికి గాను 91 మంది పాసయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 86.45, బాలికల ఉత్తీర్ణత శాతం 95.79గా నమోదైనట్లుగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రికౌంటింగ్, రివాల్యూయేషన్ కోసం జూలై 7వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రికౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రివాల్యూయేషన్‌కు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

సర్టిఫికెట్ల పరిశీలన షురూ



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధ్యాపకులు

ఆదిలాబాద్‌టౌన్: పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగనుంది. తొలి రోజు 105 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా, 103 మంది హాజరయ్యారు. వారి సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. ప్రక్రియను కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు పర్యవేక్షించారు. ఇందులో సాయన్న, ఫాతిమా, సంజయ్ సింగ్, నర్సయ్య, శ్రీకాంత్, శ్రుతి సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్, నర్ర నవీన్ యాదవ్ అన్నారు. ఈ మేరకు డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా సైన్స్ అధికారి పోస్టును సర్‌ప్లస్ ఉన్న ఉపాధ్యాయునితో మాత్రమే ఎంపిక చేయాలన్నారు. డైస్‌లో ఉన్న పిల్లలను మాత్రమే కాకుండా పాఠశాలల్లో నమోదైన పిల్లలందరినీ పరిగణలోకి తీసుకొని సర్దుబాటు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు ప్రకాశ్, విఠల్‌గౌడ్ ఉన్నారు.

ఆయిల్‌పాం సాగు లాభదాయకం



రైతులతో కలిసి మొక్క నాటుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సుధాకర్

తాంసి: లాభదాయకమైన ఆయిల్‌పాం సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుధాకర్ అన్నారు. మండలంలోని హస్నాపూర్ శివారు పంటచేనులో శుక్రవారం మెగా ఆయిల్‌పాం ప్లాంటేషన్ నిర్వహించారు. స్థానిక రైతులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దీర్ఘకాలిక పంటలు సాగుచేస్తే మంచి లాభాలు పొందవచ్చన్నారు. ఆయిల్ పాం సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఉద్యాన అధికారి క్రాంతి, ఏరియా మేనేజర్ రమేశ్, రైతులు పాల్గొన్నారు.

- కాసులకు కక్కుర్తిపడి అక్రమంగా అసెస్‌మెంట్లు జారీ చేసిన వ్యవహారంలో ఇటీవల ఓ బల్దియా రెవెన్యూ అధికారిపై పోలీసు కేసు నమోదైంది. సదరు అధికారి శాఖాపరంగా సరెండర్ కావడంతో పాటు విధుల నుంచి సస్పెన్షన్‌కు గురయ్యాడు. మరో ఇద్దరు ఆర్‌ఐలపై కూడా సస్పెన్షన్ వేటు పడింది.
- ఆదిలాబాద్‌లో వివిధ అభివృద్ధి పనులు చేసిన ఓ కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లు చెల్లించేందుకు అకౌంట్స్ విభాగానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో రూ.15వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి కటకటాలపాలయ్యారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలకు నిదర్శనంగా ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. వెలుగులోనికి రానివి అనేకం ఉన్నాయనే విమర్శలున్నాయి.

బల్దియా.. అక్రమాల అడ్డా!

- ఏ పనికైనా చేయి తడపాల్సిందే
- జలగల్లా పీడిస్తున్న సిబ్బంది, అధికారులు
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- పట్టణవాసులకు తప్పని తిప్పలు



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ బల్దియా కార్యాలయం అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారింది. చేయి తడపనిదే ఏ పని జరగడం లేదనే విమర్శలున్నాయి. ఆయా పనులనిమిత్తం కార్యాలయానికి వచ్చే వారు సిబ్బంది, అధికారులు అడిగినంత ముట్టజెప్పాల్సిందే. లేదంటే నెలల తరబడి తిరిగినా అంతే సంగతులు. ఇది ఏఒక్క విభాగానికో పరిమితం కాలేదు. బల్దియాలోని దాదాపు అన్ని విభాగాల్లోనూ ఇదే పరిస్థితి. ప్రత్యేకాధికారి పట్టించుకోకపోవడం, ఉన్నతాధికారులు సైతం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందనే విమర్శలున్నాయి.

పేరులోనే 'రెవెన్యూ'

ఇక రెవెన్యూ విభాగం గురించి ఎంత చెప్పినా తక్కువే అనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. మున్సిపాలిటీకి సంబంధించిన రూ.కోట్ల విలువైన లీజు భూములను కాసులకు కక్కుర్తిపడి ఆ విభాగం అధికారులు అక్రమంగా అసెస్‌మెంట్లు జారీ చేశారు. వాటి ఆధారంగా అక్రమార్కులు రిజిస్ట్రేషన్ చేసుకుని సొంతం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. ఇందుకు బాధ్యులపై పోలీసు కేసు నమోదు కావడమే నిదర్శనం. ఇక ఇందిరమ్మ కాలనీ, 170 సర్వేనంబర్, కేఆర్‌కే కాలనీల్లో వందలాది ఖాళీ ప్లాట్లకు అక్రమంగా అసెస్‌మెంట్ చేసి ఇంటి నంబర్లు జారీ చేశారు. ఇందులో ప్రభుత్వ, అసైన్డ్ భూములకు సంబంధించిన ప్లాట్లు కూడా ఉండటం అవినీతికి అద్దం పడుతోంది. ఈ వ్యవహారంలో పలువురు ఈ విభాగం అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై భారీగా అర్జించినట్లుగా తెలుస్తోంది. దీనిపై విచారణ జరిపిన అధికారులు ఇద్దరు ఆర్‌ఐలపై సస్పెన్షన్ వేటు వేశారు. మరో ఇద్దరు ఆర్‌ఐలను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. కీలకపాత్ర పోషించిన అధికారి సరెండర్‌తో పాటు సస్పెన్షన్‌కు గురికావడం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది.

ఇంజినీరింగ్, పారిశుద్ధ్యంలోనూ ఇదే పరిస్థితి..

ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల్లోనూ అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే శంకర్ బల్దియాస్థాయి సమీక్షలో ఈ విభాగాల్లో చోటు చేసుకున్న అక్రమాలను ప్రస్తావిస్తూ అధికారులను మందలించడం తెలిసిందే. పట్టణంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల అంచనాలు రూపొందించడంలో రూ.వేలల్లో అయ్యే పనులకు రూ.లక్షల్లో కేటాయించడంతో నిధులు దుర్వినియోగమైనట్లుగా ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదులు సైతం అందాయి. ఇక పారిశుద్ధ్య నిర్వహణ విభాగంలోనూ అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లుగా బల్దియా ఉద్యోగులే చర్చించుకోవడం గమనార్హం. కార్మికులు విధులకు రాకున్నా వచ్చినట్లుగా హాజరు నమోదు, సామగ్రి కొనుగోలు, చెత్త తరలింపు వాహనాల నిర్వహణలో పలు అక్రమాలు జరిగాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల పట్టింపులేమి కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సిన అకౌంట్ విభాగంలోనూ లంచాలు డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని కొంతమంది ఉద్యోగులు, మాజీ కౌన్సిలర్లు చర్చించుకోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

అందిన కాడికి దండుకునుడే..

బల్దియాలో కీలకమైన విభాగాలు టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ. అక్రమ లేఅవుట్లు, అనుమతి లేని భవన నిర్మాణాల కట్టడితో పాటు ఆక్రమణలు చోటు చేసుకోకుండా చూడాల్సిన గురుతర బాధ్యత టౌన్ ప్లానింగ్‌దే. అయితే ఇందులో ఒకరిద్దరు అధికారులతో పాటు పలువురు సిబ్బంది ఆయా పనులకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అడిగినంత ముట్టజెప్పకుంటే కొర్రీలు విధించి భవన నిర్మాణ అనుమతులు జాప్యం చేస్తారనే విమర్శలున్నాయి. ఇక అక్రమ నిర్మాణాలు చూసీచూడనట్లు ఉండేందుకు రూ.లక్షలు దండుకున్నారనే ఆరోపణలున్నాయి. పట్టణంలో అనుమతి లేకుండా చేపట్టిన ఓ భవన నిర్మాణాన్ని కూల్చివేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి ఎనిమిది రోజులవుతున్నా పట్టించుకోకపోవడం ఇందుకు నిదర్శనం. అలాగే అక్రమంగా చేపట్టిన మరో రెండు భవనాలు కూల్చివేయాలని హైకోర్టు ఆదేశించినా వాటి జోలికి వెళ్లకపోవడం గమనార్హం.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు



వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజల నుంచి కొంతమంది డబ్బులు తీసుకుంటున్నట్లుగా ఇటీవల నా దృష్టికి కూడా వచ్చింది. త్వరలోనే బల్దియాలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం. ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, తీసుకున్నా వారిపై కఠినంగా వ్యవహరిస్తాం.

– సీవీఎన్. రాజు, మున్సిపల్ కమిషనర్

జొన్న రైతుల నిరీక్షణ

- ఇంకా తొమ్మిది వేల మందికి అందని పంట విక్రయ డబ్బులు
- వానాకాలం పెట్టుబడికి తప్పని తిప్పలు
- క్రమంగా విడుదల అవుతున్నాయంటున్న అధికారులు



తాంసిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న జొన్నలు(ఫైల్)



ఇక్కడ కనిపిస్తున్న రైతు బారె నిఖిల్. బోథ్ మండలకేంద్రం. మే 19న స్థానిక మార్కెట్ యార్డులో పీఏసీఎస్ సిబ్బందికి 60 క్వింటాళ్ల జొన్నలు విక్రయించాడు. రూ. 2లక్షలకు పైగా డబ్బులు రావాల్సి ఉంది. ప్రభుత్వం ఇటీవల బకాయిలు విడుదల షురూ చేయడంతో తనకు కూడా వస్తాయని ఆశించాడు. ఇంకా రాకపోవడంతో నిరాశ చెందుతున్నాడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో ఇలాంటి వారు వేలాది మంది ఉన్నారు.

జిల్లాలో జొన్న పంట వివరాలు
యాసంగిలో సాగైన విస్తీర్ణం : 1.10లక్షల ఎకరాలు
దిగుబడి అంచనా : లక్ష 70వేల మెట్రిక్ టన్నులు
మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది: 56వేల మెట్రిక్ టన్నులు
కనీస మద్దతు ధర : రూ.3,371
రైతులకు రావాల్సిన డబ్బులు (20వేల మందికి) : రూ.188 కోట్లు
ఇప్పటి వరకు వచ్చినవి (11వేల మందికి): రూ.113 కోట్లు

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో 20వేల మంది రైతులు యాసంగి సీజన్‌లో మద్దతు ధరకు జొన్నలు విక్రయించారు. ఈ డబ్బులు సాధారణంగా 48 నుంచి 72 గంటల్లోగా వారి ఖాతాల్లో చేరాలి. నెల దాటినా ఇప్పటి వరకు కేవలం 11వేల మందికి సంబంధించిన డబ్బులు మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా వారి ఖాతాల్లో జమ అయ్యాయి. ఇంకా 9వేల మంది ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ మొదలైంది. పెట్టుబడికి ఆసరా అవుతాయనుకొని డబ్బుల కోసం వారంతా ఎదురుచూస్తున్నారు. త్వరగా అందేలా చూడాలని కోరుతున్నారు.

కొనుగోళ్లు ముగిసి దాదాపు నెల..

జిల్లాలో యాసంగి సీజన్‌లో జొన్న పంటను రైతులు పెద్ద ఎత్తున సాగు చేశారు. దిగుబడి కూడా పెద్దమొత్తంలో వచ్చింది. ఇదిలా ఉంటే గత ఏప్రిల్ 22న మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్‌ల్లో మొత్తం 16 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి జొన్నల విక్రయాలు చేపట్టారు. మే 31తో మూడు సెంటర్లు మినహా జిల్లాలోని అన్ని కేంద్రాలు మూతపడ్డాయి. ఆదిలాబాద్, జైనథ్, నార్నూర్‌లో జూన్ 6వరకు కొనుగోలు చేశారు.

డబ్బుల కోసం ఎదురుచూపులు..

రూ.వందల కోట్ల విలువైన జొన్నలను విక్రయించిన జిల్లా రైతులు ఆ డబ్బులను మాత్రం నిర్దేశిత సమయంలో అందుకోలేక పోయారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇటు రైతు భరోసా విడుదల చేయడంతో పాటు జొన్న పంట విక్రయించిన రైతులకు రావాల్సిన డబ్బులను కూడా విడుదల చేస్తూ వచ్చింది. విడతల వారీగా ప్రక్రియ కొనసాగుతుండడంతో మిగిలిన రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.

మార్క్‌ఫెడ్ కొన్నది కొంతే..

జిల్లాలో యాసంగి సీజన్‌లో లక్ష 70వేల మెట్రిక్ టన్నుల జొన్నల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం అందజేసిన మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371. అయితే ప్రైవేట్‌లో రైతులకు రూ.3వేల లోపే ధర దక్కింది. ఇదిలా ఉంటే మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం 56వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. ఈ లెక్కన మద్దతు ధర దక్కింది కొంత మంది రైతులకే. మిగతా జొన్నలను పలువురు రైతులు ప్రైవేట్‌లో తక్కువ ధరకే విక్రయించారు. పలువురు దళారులు జొన్నలను రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసి మద్దతు ధరకు ప్రభుత్వరంగ సంస్థకు విక్రయించారనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

క్రమంగా డబ్బులు విడుదల..



జొన్నలు విక్రయించిన రైతులకు క్రమంగా ప్రభుత్వం డబ్బులు విడుదల చేస్తుంది. మిగతా రైతులకు కూడా త్వరలో జమ అవుతాయి. ఆందోళన అవసరం లేదు.

– ప్రవీణ్, మార్క్‌ఫెడ్ డీఎం, ఆదిలాబాద్

నా ఫోన్ కూడా ట్యాప్‌చేసి ఉండవచ్చు..

- తలతిక్క పనులు చేశారు కాబట్టే బీఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించారు
- కాళేశ్వరం నిర్మాణంలో ఏకచత్రాధిపత్యం నడిచింది
- రాష్ట్ర మంత్రి 'జూపల్లి'

సాక్షి,ఆదిలాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నా ఫోన్‌ను కూడా ట్యాప్ చేసి ఉండవచ్చని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో ఆదిలాబాద్ పర్యటనలో ఉన్న ఆయన రెండో రోజు శుక్రవారం వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఓ ప్రశ్నకు సమాధానం ఇస్తూ పై వ్యాఖ్యలు చేశారు. దేశంలోనే ఆదర్శపాలన అందించామని చెప్పే బీఆర్‌ఎస్ ఫోన్ ట్యాపింగ్‌తో ఏం సందేశం ఇచ్చారని ప్రశ్నించారు. ఇతరుల సంసారాల్లో తొంగి చూడటం ఏంటన్నారు. కాళేశ్వరం నిర్మాణ సమయంలో ఏకచత్రాధిపత్యం నడిచిందని పేర్కొన్నారు. నిర్ణయాలన్నీ ఒక రాజులా తీసుకున్నారని తెలిపారు. కాళేశ్వరం విచారణ కమిషన్‌కు ప్రభుత్వం అన్ని పత్రాలను సమర్పించిందని వివరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి నిధుల కేటాయింపులో అన్యాయం చేస్తుందని ధ్వజమెత్తారు. తెలంగాణలోని ఏ ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చడంతో ప్రస్తుతం అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. వాటన్నింటినీ దాటుకొని ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో ఎమ్మెల్సీ దండే విఠల్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు..

ఆదిలాబాద్‌టౌన్: పేదలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడతామని మంత్రి జూపల్లి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రిమ్స్‌తో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ లోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని రిమ్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. దాదాపు గంటసేపు అన్ని వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రికి అవసరమైన పరికరాలతో పాటు ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామన్నారు. ఆస్పత్రిలో దెబ్బతిన్న ఫ్లోరింగ్, తుప్పు పట్టిన కిటికీలను సరిచేయించాలని ఆదేశించారు. మంత్రి వెంట ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ విఠల్, కలెక్టర్ రాజర్షిషా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఎస్పీ అఖిల్ మహాజన్ తదితరులున్నారు.

జైళ్లశాఖ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా జైలు ఖైదీలు తయారు చేసిన సీడ్ బాల్స్ పంపిణీని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అశోక్ మాట్లాడుతూ.. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా ఆదేశాల మేరకు అటవీ విస్తీర్ణం పెంచాలనే ఉద్దేశంతో 10వేల సీడ్స్ బాల్స్‌ను తయారు చేసినట్లు తెలిపారు. ఇందులో సీతాఫలం, జామ, చింత, రావి, సంద్ర, మేడి తదితర సీడ్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. జైలు బంక్‌కు వచ్చే వినియోగదారులతో పాటు ప్రజలకు 3వేల సీడ్‌బాల్స్ పంపిణీ చేశామన్నారు. అలాగే ఆసిఫాబాద్ స్పెషల్ సబ్‌జైలుకు 3,500, లక్సెట్టిపేట సబ్ జైలుకు వెయ్యి వరకు సీడ్ బాల్స్ సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో డిప్యూటీ జైలర్‌రాథోడ్ ప్రకాశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బంక్‌లో వినియోగదారులకు సీడ్ బాల్స్ అందజేస్తున్న జైలు సూపరింటెండెంట్ అశోక్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



5కే రన్‌లో పాల్గొన్న మంత్రి జూపల్లి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యేలు శంకర్, బొజ్జు

- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు
- జిల్లాకేంద్రంలో ఉత్సాహంగా 5కే రన్

ఆదిలాబాద్: జీవితం ఎంతో విలువైనదని, ఈ మేరకు యువత, విద్యార్థులు డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రన్ ఫర్ హోప్ యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో 5కే రన్ నిర్వహించారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దన్నారు. చదువుతో పాటు వ్యాయామం, క్రీడలకు ప్రాధాన్యమిచ్చి తల్లిదండ్రులు, పుట్టిన ఊరు గర్వపడేలా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. మత్తు పదార్థాలను పండించడం, రవాణా చేయడం, సేవించడం వంటి వాటికి పాల్పడితే ప్రభుత్వ పథకాలను నిలిపివేస్తామన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు సోషల్ మీడియాలో చూసి డ్రగ్స్‌కు ఆకర్షితులు కావొద్దన్నారు. మత్తు పదార్థాల విషయంలో పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ఆదిలాబాద్ శంకర్ మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి నివారణకు ప్రజాప్రతినిధులుగా తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం రన్‌లో విజేతలుగా నిలిచిన తొలి 15 మందికి బహుమతిగా సైకిళ్లను అందించారు. పురుషుల విభాగంలో మొదటిస్థానంలో సురేందర్, మహిళల భాగంలో శిల్ప నిలిచారు. కార్యక్రమంలో భాగంగా అంకోలి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ సలోని, ఏఎస్పీ కాజల్, డీఎస్పీ జీవన్ రెడ్డి, డీవైఎస్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎకో టూరిజం అభివృద్ధికి కృషి..



పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కృష్ణారావు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌ను ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మావలలోని హరితవనం పార్కును శుక్రవారం సందర్శించారు. ముందుగా ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అర్బన్ డెవలప్‌మెంట్‌లో భాగంగా కాటేజెస్, వివిధ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మొక్క నాటారు. అనంతరం సఫారీలో పర్యటించారు. ఆయన వెంట ఎంపీ గోడం నగేశ్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సీసీఎఫ్ శర్వానంద్, డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్, ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర, ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, బీట్ ఆఫీసర్లు ప్రశాంత్, కృష్ణ, తదితరులున్నారు.

మంత్రి సమక్షంలోనే ఎమ్మెల్యే, 'కంది' వాగ్వాదం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో ఇటీవల ఆక్రమణలను తొలగించిన అంబేద్కర్‌చౌక్, వీధి వ్యాపారులకు కేటాయించిన గణేశ్ థియేటర్ ప్రాంతాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం సందర్శించారు. వీధి వ్యాపారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకునే క్రమంలో ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రధాన చౌక్‌ల్లో ఆక్రమణల తొలగింపుతో ట్రాఫిక్ సమస్య దూరమైందని, కొంతమంది స్వార్థపూరిత రాజకీయాల కోసం మళ్లీ వ్యాపారులను రెచ్చగొడుతున్నారంటూ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దినేష్ మటోలియా మంత్రికి తెలిపారు. ఈ క్రమంలో 'కంది' కల్పించుకుని 'నీకు ఏం తెలుసని మాట్లాడుతున్నావని' గట్టిగా ప్రశ్నించారు. ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే నువ్వేమి మాట్లాడుతున్నావంటూ ప్రశ్నించారు. ఇరువురు పరస్పరం వాగ్వాదానికి దిగారు. పరిస్థితి అదుపుతప్పుతుందని గ్రహించిన మంత్రి ఇరువురికి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఆక్రమణలను ఉన్నపాటుగా ఎందుకు తొలగించాల్సి వచ్చిందని మంత్రి మున్సిపల్ కమిషనర్ రాజును ప్రశ్నించారు. ట్రాఫిక్ సమస్యతోనే తొలగించామని ఆయన బదులిచ్చారు. కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్ సంయుక్తంగా చర్చించి తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ అక్కడి నుంచి మంత్రి వెనుదిరిగారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ దండే విఠల్, ఎంపీ గోడం నగేశ్, డీఎస్పీ జీవన్‌రెడ్డి తదితరులున్నారు.



మంత్రి సమక్షంలో వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే శంకర్, కంది శ్రీనివాస్‌రెడ్డి

క్లుప్తంగా

దేశీదారు పట్టివేత


పట్టుబడిన దేశీదారుతో పోలీసులు

వాంకిడి: మహారాష్ట్ర నుంచి ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న దేశీదారును శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వస నీయ సమాచారం మేరకు వాంకిడి బస్టాండ్‌లో ఏఎస్సై పోశెట్టి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. గడ్చిరోలి జిల్లా సిరోంచకు చెందిన మారగోని కృష్ణమూర్తిగౌడ్ బస్సులో దేశీదారు తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడి నుంచి 250 (90ఎంఎల్) దేశీదారు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.12,500 ఉంటుందని పేర్కొన్నారు.

బస్సును ఢీకొన్న లారీ

సాత్నాల: భోరజ్ మండలంలోని తర్ణం లోలెవెల్ వంతెన వద్ద అతివేగంగా వస్తున్న లారీ ముందు వెళ్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సును ఢీకొట్టి వాగులో పడిపోయింది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై గౌతమ్ పవర్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాపూర్ నుంచి ప్రయాణికులను తీసుకుని ఆదిలాబాద్‌కు వస్తున్న మహారాష్ట్ర బస్సు గురువారం రాత్రి బ్రిడ్జి దాటుతుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. ఢీకొట్టిన వేగానికి లారీ బ్రిడ్జి కింద నదిలో పడిపోయింది. బస్సు డ్రైవర్ చౌహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

ముధోల్: మండలంలోని రాజు తండా గ్రామానికి చెందిన మీరాబాయి అనే మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలైనట్లు ఎస్సై బిట్లా పెర్సిస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మీరాబాయి గ్రామంలో బహిర్భూమికని ముధోల్ నుంచి ఆష్టా రోడ్డుకు వెళ్తుండగా గన్నారం వైపు స్పీడుగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్ర గాయాలపాలైంది. గ్రామస్తులు చికిత్స కోసం 108లో భైంసా ఏరియా స్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో ముగ్గురి రిమాండ్

నెన్నెల: మండలంలోని జోగపూర్ గ్రామానికి చెందిన సప్ప అనిల్, సునీల్‌కుమార్‌ను దాడి కేసులో శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 3న అదే గ్రామానికి చెందిన సప్ప భీమయ్య బెల్లంపల్లి నుంచి బైక్‌పై వస్తుండగా దారికాచి కర్రలతో దాడి చేసి గాయపర్చారని పేర్కొన్నారు. భీమయ్య చెయ్యి విరిగి, కాలు, తలకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. బాధితుడి మెడికల్ సర్టిఫికెట్ ఆధారంగా కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

ఎట్టకేలకు వేతనాలు

- డీఎస్సీ-2008 ఎస్జీటీల సాలరీ నిధుల విడుదల
- గత ఫిబ్రవరిలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చేరిక
- 61మంది ఉపాధ్యాయులకు లబ్ధి
- ఉమ్మడి జిల్లాకు రూ.2.5 కోట్లు విడుదల

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లా	ఎస్జీటీలు	విడుదలైన నిధులు (రూ.లో)
నిర్మల్	14	58,51,000
ఆదిలాబాద్	07	29,25,500
కుమురంభీం	28	1,17,02,100
మంచిర్యాల	12	50,15,200
మొత్తం	61	2,54,93,800



నిర్మల్‌ఖిల్లా: ఉద్యోగ నియామకం కోసం పరీక్ష రాసి ఎంపికైన తర్వాత 15 ఏళ్లుగా వేచి చూసిన వారికి గత ఫిబ్రవరిలో నియామక ఉత్తర్వులు చేతికందాయి. ఫిబ్రవరి 16వ తేదీన కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా కొలువులో చేరిన వీరికి ఇప్పటివరకు వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎట్టకేలకు ఉమ్మడి జిల్లాలోని ఎస్జీటీలకు రూ.2.5 కోట్ల నిధులు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విధుల్లో చేరిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 61 మంది కాంట్రాక్ట్ ఎస్జీటీలు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్సీ 2008 బాధితులు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నోటిఫికేషన్ వెలువడిన అనంతరం తీసుకున్న నిర్ణయం మేరకు 30 శాతం పోస్టులు ప్రత్యేకంగా డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో అప్పుడు బీఈడీ పూర్తి చేసుకుని ఎస్జీటీలుగా ఎంపికైన ఉమ్మడి జిల్లాలోని 100 మందికి పైగా అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోయారు. అప్పటినుంచి దశాబ్దకాలానికి పైగా కోర్టుల్లో న్యాయపోరాటం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే అభ్యర్థులకు కాంట్రాక్ట్ విధానంలో ఎస్జీటీలుగా నియామకాలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు గత ఫిబ్రవరి 15వ తేదీన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 61 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. 16ఏళ్ల పాటు ఉద్యోగాలకు దూరమై కోర్టుల చుట్టూ తిరిగిన వీరికి నియామకాలు పొందిన తర్వాత కూడా దాదాపు నాలుగు నెలలు పూర్తవుతున్నా వేతనాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా బడ్జెట్ కేటాయించగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా విధులు నిర్వహిస్తున్న 61 మందికి వేతనాలు అందనున్నాయి. ఒక్కో ఎస్జీటీకి నెలకు బేసిక్ పే రూ.31,040 కాగా, నాలుగునెలల వేతనాలు వారి అకౌంట్లలో జమచేయనున్నారు.

సుదీర్ఘ నిరీక్షణ అనంతరం

నిర్మల్ జిల్లాలో 14 మంది, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 28 మంది, ఆదిలాబాద్ జిల్లాలో ఏడుగురు, మంచిర్యాల జిల్లాలో 12 మంది కాంట్రాక్ట్ ఎస్జీటీలున్నారు. వీరి నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లింపునకు ఉమ్మడి జిల్లాకు రూ.2కోట్ల 54లక్షల 93వేల 800 విడుదల చేయడంతో నిర్మల్ జిల్లాకు చెందిన కాంట్రాక్ట్ ఎస్జీటీలు గంగాధర్, రాజేశ్వర్, ప్రభ, చంద్రశేఖర్, వినోద్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణా కేసులో మరో ఇద్దరి అరెస్ట్

- హరిదాస్‌ను కానిస్టేబుల్ ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగింపు


నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ రవీందర్

సాక్షి, ఆసిఫాబాద్: మానవ అక్రమ రవాణాకు పాల్పడి పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను ఆసిఫాబాద్ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ శుక్రవారం మధ్యాహ్నం సీఐ రవీందర్‌తో కలిసి విలేకరులకు వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లో.. 'మానవ అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలుంటాయి. తన కూతురు ఏడాదిగా కనబడడం లేదని ఈ నెల 11న వాడిగొంది గ్రామవాసి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించాం. మహిళకు చెందిన ఆధార్ కార్డులోని ఫోన్ నంబర్‌కు కాల్ చేయగా.. ఆమె మధ్యప్రదేశ్‌లో ఉన్నట్లు పోలీసులకు తెలిసింది. ఆమె ఇచ్చిన సమాచారంతో ఒక పోలీస్ బృందాన్ని మధ్యప్రదేశ్‌కు పంపి ఆమెను ఇక్కడికి తీసుకువచ్చాం. ఆమె ఇచ్చిన వివరాల మేరకు.. చింతలమానేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ 2022 నుంచి విధులకు గైర్హాజరవుతున్న కామెరి హరిదాస్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న నేపథ్యంలోనే.. తననూ కానిస్టేబుల్ హరిదాస్ ముఠా మోసం చేసి విక్రయించిందని ఆసిఫాబాద్ పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ రెండు వేర్వేరు కేసుల్లో లోతుగా దర్యాప్తు చేపట్టగా మొత్తం 10 మందికి సంబంధం ఉన్నట్లు తెలిసింది. ఇందులో ఎనిమిది మంది నిందితులను 10రోజుల కిందట అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం. పరారీలో ఉన్న మధ్యప్రదేశ్‌కు చెందిన బషీర్ రమేశ్‌గౌడ్ (ఏ7), జగదీశ్ సోనీ (ఏ9)ని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం.' అని ఏఎస్పీ తెలిపారు.

'తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి'

'పెళ్లికుమారుడికి వరకట్నం ఇస్తేనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు జరుగుతున్న నేటి పరిస్థితుల్లో.. ఆడపిల్లకు ఎదురుకట్నం ఇచ్చి పెళ్లి చేసుకుంటామని మాయమాటలు చెప్పి మోసగించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న వారిపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. అసలు వారు తమ పిల్లను ఎందుకు పెళ్లి చేసుకోవాలనుకుంటున్నారు? వారి వివరాలు ఏమిటి? వారు ఎక్కడి నుంచి వచ్చారు? వారికి స్థానికంగా సహకరిస్తున్న వారెవరు? అలాంటి వారి గత చరిత్రపై ఆరా తీయాలి. ఎలాంటి సందేహం తలెత్తినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం చేస్తాం.' అని ఏఎస్పీ సూచించారు.

కానిస్టేబుల్ ఉద్యోగం నుంచి తొలగింపు

తిర్యాణి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇదివరకు ఇలాంటి కేసులో ముద్దాయిగా ఉన్న కానిస్టేబుల్ కామెరి హరిదాస్.. మళ్లీ తన విధానం మార్చుకోకపోగా తాజాగా రెండు వేర్వేరు కేసుల్లో నిందితుడిగా తేలింది. దీంతో అతనిపై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయగా.. గురువారం అతన్ని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు పోలీస్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులపైనా కఠినచర్యలు ఉంటాయనడానికి కానిస్టేబుల్ హరిదాస్ ఉదంతమే ఒక నిదర్శనం.

సడెన్‌గా ఆగిన లారీని ఢీకొన్న ఆటో

- తీవ్రంగా గాయపడ్డ ఆటో డ్రైవర్ మృతి
- ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం


ఆటోలో రాజేశ్ మృతదేహం


రాజేశ్ (ఫైల్)

జైపూర్: కళ్లు మూసి తెరిచేలోపే మృత్యువు కబళించింది. వేగంగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా ఆగడంతో వెనుక వస్తున్న ఆటో అదుపు తప్పి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలోని సాయిరాంనగర్‌కు చెందిన పొడల రాజేశ్ (30) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం మంచిర్యాల నుంచి గోదావరిఖనికి రాళ్లపేటకు చెందిన సయ్యద్ అజీమ్, బెల్లంపల్లికి చెందిన అయిల్ల రమను ఆటోలో గోదావరిఖనికి తీసుకువెళ్తున్నాడు. ఇందారం అటవీ శాఖ చెక్‌పోస్టు దాటిన తర్వాత గోదావరి బ్రిడ్జి వద్ద మంచిర్యాల నుంచి గోదావరిఖని వైపు వేగంగా వెళ్తున్న లారీని డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేసి నిలిపివేయడంతో వెనుకే వస్తున్న ఆటో అదుపు తప్పి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, ఆటో డ్రైవర్ రాజేశ్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న ఇద్దరు ప్యాసింజర్లు సయ్యద్ అజీమ్, అయిల్ల రమ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రమ తలకు బలమైన గాయం కావడంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఆమెను కరీంనగర్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని స్థానిక ఎస్సై శ్రీధర్ పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడు రాజేశ్‌కు ఇద్దరు భార్యలు లావణ్య, గాయత్రి ఉన్నారు. రెండ్రోజుల క్రితం ఇదే ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడడం గమనార్హం.


గాయపడ్డ అజీమ్


గాయపడ్డ రమ

జీవో 49ని అమలు కానివ్వం

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆదివాసీ సంఘాల నాయకులతో సమీక్షా సమావేశం


ఉట్నూర్‌రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, వేదికపై ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్లు

ఉట్నూర్‌రూరల్: జీవో 49ని అమలు కాకుండా చూస్తామని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలోగల పీఎమ్మార్సీ సమావేశ మందిరంలో ఆదివాసీ సంఘాల నాయకులు, పెద్దలతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు కేబీ ప్రాంగణంలోని కుమురంభీం విగ్రహంపై పూలు చల్లి నివాళులర్పించారు. ముందుగా ఆదివాసీ పెద్దలు మాట్లాడుతూ.. పులుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటు పేరిట జీవో 49 అమలు అంటూ ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. జీవోను రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు, గిరిజన పెద్దలు, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. జీవో 49పై గెజిట్ నోటిఫికేషన్ ఇంకా జారీ చేయలేదని, అమల్లోకి రాలేదని చెప్పారు. గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయవద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ఆదివాసీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అటవీ, పర్యావరణ అంశం కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న విస్తృత అధికారాలను ఉపయోగించి ఆదివాసీలకు మేలు చేసేలా సముచిత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అందేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉందని తెలిపారు.

గెజిట్ వచ్చిందన్న ఎంపీ నగేశ్

జీవో 49పై గెజిట్ రాలేదని మంత్రి జూపల్లి అంటున్న సందర్భంలో ఎంపీ గోడం నగేశ్ కల్పించుకుని గెజిట్ నోటిఫికేషన్ వచ్చిందని తెలిపారు. దీంతో స్పందించిన మంత్రి సమావేశంలోనే అటవీశాఖ ఉన్నతాధికారిని ఫోన్‌లో సంప్రదించగా ఇంకా జారీ చేయలేదని సమాధానం రాగా సమావేశం సజావుగా సాగింది. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ.. సీఎం దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కలెక్టర్లు రాజర్షిషా, వెంకటేశ్ దోత్రే, ఎస్పీలు అఖిల్ మహాజన్, కాంతిలాల్ పాటిల్, డీఎఫ్‌వోలు నీరజ్‌కుమార్, ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, రాయిసెంటర్ సర్మేడి దుర్గు, ఏఎస్పీ కాజల్, సబ్‌కలెక్టర్ యువరాజ్, ఆయా శాఖల అధికారులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి స్థూపం వద్ద నివాళి

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపానికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్మృతివనంలో మొక్క నాటారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, రగల్ జెండా ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు తొడసం నాగోరావ్ తదితరులున్నారు.

ఇంటి కోసం మహిళ ఆత్మహత్యాయత్నం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట కూర్చున్న లక్ష్మి

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఓ మహిళ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేయడం చర్చనీయాంశమైంది. మండలంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కనుకదుర్గ కాలనీకి చెందిన పూరెల్లి లక్ష్మి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించింది. తనకు ఫస్ట్ లిస్ట్‌లో పేరు వచ్చిందని ఫైనల్ లిస్ట్‌లో తొలగించారని ఆరోపించింది. 30 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటూ ఇండ్లల్లో గిన్నెలు కడుక్కుని జీవనం సాగిస్తున్నానని తెలిపింది. అద్దె చెల్లించలేక ఇబ్బంది పడుతున్నానని వివరించింది. ఇల్లు కేటాయించాలని కోరింది. దరఖాస్తు పరిశీలించిన అనంతరం అర్హత ఉంటే తప్పకుండా ఇల్లు మంజూరవుతుందని తహసీల్దార్ సమాధానం ఇచ్చారు. వెంటనే మహిళ తహసీల్దార్ కార్యాలయం నుంచి బయటకు వచ్చి ముందుగానే వెంట తెచ్చుకున్న పెట్రోల్ మీద పోసుకుంది. ఇల్లు కేటాయించకుంటే ఆత్మహత్య చేసుకుంటానని తెలిపింది. అక్కడున్న కార్యాలయ సిబ్బంది అప్రమత్తమై ఆ మహిళ ప్రయత్నాన్ని నిలువరించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళను అదుపులోకి తీసుకున్నారు. సముదాయించి ఆమె ఇంటికి పంపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


అరుణ్ (ఫైల్)

తాంసి: మనస్తాపంతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని జామిడి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మునేశ్వర్ అరుణ్ (32) వ్యవసాయం చేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. గతేడాది అరుణ్ వివాహం నిశ్చయమై ఆ తర్వాత క్యాన్సిల్ అయింది. అలాగే తనకున్న రెండెకరాలపై జామిడి సహకార సంఘంలో రూ.2.30 లక్షల రుణం తీసుకోగా మాఫీ కాలేదు. దీంతో కొంత కాలంగా దిగులు చెందుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం వేకువజామున పంటచేనుకు వెళ్లి పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అరుణ్‌ను అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రిలో తాంసి ఎస్సై ప్రణయ్‌కుమార్ పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి సోదరుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


శేఖర్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి శివారు ప్రాంతంలోగల వాగులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన యువకుడు జొగ్దాన్ శేఖర్ (19) మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని డాల్డా కంపెనీ ప్రాంతానికి చెందిన శేఖర్, వికాస్, కృష్ణ గురువారం చేపల వేటకు వెళ్లిన విషయం తెలిసిందే. చేపలు పట్టే సమయంలో శేఖర్ ప్రమాదవశాత్తు జారి వాగులో పడ్డాడు. నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. శేఖర్ కోసం గురువారం రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గాలింపు కొనసాగించగా అతడి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాళ్లు కడిగి వీడ్కోలు పలికారు


చంద్రబాయి కాళ్లు కడుగుతున్న ఆస్పత్రి సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని ఏరియాస్పత్రిలో పారిశుధ్య విభాగంలో పనిచేసిన కార్మికురాలు చంద్రబాయికి ఆస్పత్రి సిబ్బంది అరుదైన వీడ్కోలు పలికారు. పట్టణానికి చెందిన చంద్రబాయి 15 ఏళ్లుగా ఆస్పత్రిలో సేవలందిస్తోంది. 60 ఏళ్లు పూర్తి కావడం, అనారోగ్య కారణాలతో ఉద్యోగ విరమణ పొందింది. దీంతో శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ ఆధ్వర్యంలో ఆమెకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. సిబ్బంది ఆమె కాళ్లు కడిగి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. దీంతో వైద్యులు అనిల్, నర్సులు, తోటి సిబ్బంది వారిని అభినందించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 295 మంది హాజరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో శుక్రవారం పాలిసెట్-25లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండోరోజు విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ సాయంత్రం 6 గంటల వరకు సాగింది. మొత్తం 295 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను సంబంధిత అధికారులు పరిశీలించి ధృవీకరించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్, కౌన్సెలింగ్ ఇన్‌చార్జి టీ మధుకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


సంపత్‌కుమార్

లక్సెట్టిపేట: మున్సిపల్ కమిషనర్‌గా సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన మారుతీప్రసాద్ సీడీఎంఏకు బదిలీ కాగా, హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో విధులు నిర్వహిస్తున్న సంపత్‌కుమార్ బది లీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అతడికి కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

ఇచ్చోడ: నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం మోపుతున్నామని ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న ఇద్దరిపై ఈనెల 16న కేసు నమోదు చేయగా, పరారీలో ఉన్న వ్యక్తిని శుక్రవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఈనెల 16న ఇచ్చోడ మండలం దాబా(బి) గ్రామంలో తనిఖీలు నిర్వహించగా నరవాటే ఈశ్వర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి వద్ద 20 బ్యాగ్‌ల పింక్ బాండ్ 5జీ నకిలీ విత్తనాలు లభించగా, విచారణలో తాను ఆదిలాబాద్‌కు చెందిన పిప్పల్వార్ సునీల్ వద్ద తీసుకున్నట్లు చెప్పాడని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా, పరారీలో ఉన్న పిప్పల్వార్ సునీల్‌ను ఆదిలాబాద్ జిల్లా సాంకేతిక నిపుణులు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపీకృష్ణ సూచన మేరకు ఇచ్చోడ ఎస్సై పురుషోత్తం హైదరాబాద్‌కు పోలీస్ బృందాన్ని పంపి అతడిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

ఆర్జీయూకేటీలో ధ్రువపత్రాల పరిశీలన


సర్టిఫికెట్ల పరిశీలనలో ఇన్‌చార్జి వీసీ, సిబ్బంది

బాసర: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) బాసరలో మహబూబ్‌నగర్ కేంద్రానికి చెందిన స్పోర్ట్స్, ఎన్‌సీసీ కోటా ఆధారిత విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం చేపట్టారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ మురళీదర్శన్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ చాలా సమర్థవంతంగా, సజావుగా ముందుకు సాగుతోందని తెలిపారు. నాణ్యమైన విద్య, విద్యార్థుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతీ సమస్యను పట్టుదలతో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. సమర్థవంతంగా యూనివర్సిటీని నిర్వహించడమే తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఎన్‌సీసీ కోటాలో విద్యార్థులు అందించిన క్యాంప్ సర్టిఫికెట్లు, రిపబ్లిక్ డే పరేడ్ సర్టిఫికెట్లు పూర్తిగా పరిశీలించినట్లు చెప్పారు. స్పోర్ట్స్ కోటా కోసం 31 క్రీడల జాబితాలో లభించే ఆటల ఆధారంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పొందిన ప్రమాణ పత్రాలను తప్పనిసరిగా ధ్రువీకరించినట్లు తెలిపారు. క్రీడా సంఘాల గుర్తింపు, పోటీల స్థాయి, తేదీ, అర్హత ప్రమాణాలను బట్టి జాగ్రత్తగా తనిఖీ చేసినట్లు చెప్పారు. ధ్రువపత్రాల పరిశీలనను కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కోకన్వీనర్లు డాక్టర్ దేవరాజు, డాక్టర్ విఠల్, డాక్టర్ భవ్‌సింగ్, డాక్టర్ రాకేశ్‌రెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌చార్జి దస్తగిరి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి పీడీ శ్యాంబాబు, సహాయకులు కిషన్, ఉదయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

- సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎదుట ప్రజాసంఘాల ధర్నా


స్వప్న (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని కుమ్మరి స్వప్న (19) ఈ నెల 24న రాత్రి కళాశాల భవనం మూడో అంతస్తు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన ఘటన తెలిసిందే. కాగా స్వప్నను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవా రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపా రు. ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం మార్థిడి గ్రామానికి చెందిన కుమ్మరి లచ్చన్న-సుక్కవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు స్వప్న జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో బీజెడ్సీ రెండో సంవత్సరం చదువుతోంది. లచ్చన్న వ్యవసాయంతోపాటు ఆర్ఎంపీగా పని చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, స్వప్న మరణాన్ని లచ్చన్న కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. స్వప్న చికిత్స పొందుతూ మృతి చెందిన అనంతరం లచ్చన్న హైదరాబాద్‌లోని పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం పూర్తి చేసి స్వప్న మృతదేహాన్ని అప్పగించారు. కాగా, స్వప్న మృతి మిస్టరీగానే మిగిలింది.


కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

హాస్టల్ భవనం వద్ద ఆందోళన

స్వప్న మరణ వార్త తెలుసుకున్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజాసంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. స్వప్న మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వప్న కుటుంబానికి రూ.50లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐ ప్రమోద్‌రావు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. స్వప్న కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చి ఆందోళన విరమింపజేశారు.

స్వగ్రామానికి మృతదేహం తరలింపు

ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు స్వప్న మృతదేహాన్ని ఆమె స్వగ్రామం మార్థిడికి హైదరాబాద్ నుంచి నేరుగా తరలించారు. కళాశాల భవనం వద్ద ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తుగా భారీగా మోహరించారు.